నులి పురుగుల నివారణకు కృషి చేద్దాం

జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, ఫిబ్రవరి 7 : నులి పురుగుల నివారణకు విద్యార్థులందరికీ మాత్రలు అందించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 12వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం విజయవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, వసతి గృహాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, కళాశాలల్లోని విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 19వ తేదీలోగా జిల్లాలోని విద్యార్థినీవిద్యార్థులందరికీ 100 శాతం ఈ మాత్రలు అందించే లక్ష్యాన్ని పూర్తి చేసేలా కృషి చేయాలని తెలిపారు. ప్రతి సంవత్సరం 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు వరకు రెండుసార్లు మాత్రలు అందించడం జరుగుతుందని, 2 సంవత్సరాల వయస్సు లోపు వారికి అర మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు వారికి 1 మాత్ర అందించడం జరుగుతుందని వివరించారు. మాత్ర వేసుకునే ముందు విద్యార్థులు భోజనం చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పాల్వన్ కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకాదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి, మెప్మా పీడీ రవికుమార్, డీఐవో డాక్టర్ బుచ్చిబాబు, స్టాటిస్టికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేఆర్ఎంబీ కేంద్రానికి ధారాదత్తం

- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే చే జారిన ప్రాజెక్టులు
- 13న నిర్వహించే నల్లగొండ సభను విజయవంతం చేయాలి
- మీడియా సమావేశంలో తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 7 : శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణ కోసం కేఆర్ఎంబీ ఇప్పటికే రూపొందించిన ఆపరేషనల్ ప్రొటోకాల్ ఏపీకీ వత్తాసు పలికేలా ఉన్నదని తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆపరేషనల్ ప్రొటోకాల్ ముసాయిదాలో చేసిన ప్రతిపాదనలతో తెలంగాణ 45 టీఎంసీల నికర జలాలను కోల్పోవాల్సిన ప్రమాదం ఏర్పడిందన్నారు. సహజ ప్రవాహాల ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీటిని అందించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా నాగార్జునసాగర్ నుంచే 72.2 టీఎంసీలను కేటాయిస్తూ ప్రొటోకాల్‌లో రూల్ పెట్టినట్లు తెలిపారు. ఇప్పటికే కేటాయింపునకు మించి 29 టీఎంసీలను డెల్టాకు మళ్లిస్తున్నారన్నారు. జల విద్యుత్తు ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి చేసిన కరెంటును ఇరు రాష్ట్రాలు 50:50 నిష్పత్తిలో పంచుకోవాలని ఆర్ఎంసీ ప్రతిపాదించడంతో తెలంగాణకు తీవ్రంగా అన్యాయం జరుగుతున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే ప్రాజెక్టులు చే జారుతున్నాయని అన్నారు. కృష్ణా జలాలను కేఆర్ఎంబీకి అప్పగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈ నెల 13న నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు తెస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పరుగెత్తిందన్నారు. విద్య, వైద్యంతో పాటు సాగు, తాగు నీరుపై విప్లవాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. తొమ్మిదిన్నర ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో తాండూరు నియోజకవర్గంలో రూ.1672.49 కోట్లతో అభివృద్ధి, రూ.1648.12 కోట్లతో ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు వెల్లడించారు. అప్పట్లో మేము తెచ్చిన అభివృద్ధి పనులు సాగకుండా అడ్డుకట్టు వేసే ప్రయత్నాలు చేస్తే ఉద్యమించడం తప్పదన్నారు. అభివృద్ధిలో రాజకీయం చేయకుండా పనులన్నీ సాఫీగా నడిచేందుకు కృషి చేయాలన్నారు. అధికారం, పదవీ వ్యామోహంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే బాగుండదని హెచ్చరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప పాల్గొన్నారు.

పదో తరగతిలో.. వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధ్యక్షతన పదో తరగతి పరీక్షలపై ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గత సంవత్సరం కంటే అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రధానోపాధ్యాయులు పని చేయాలన్నారు. విద్యార్థులు పదో తరగతిలో పాస్ అయితేనే జీవితంలో మెరుగైన స్థితిలో ముందుకు సాగుతారని తెలిపారు. గతంలో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో వసరులు మెరుగుపడ్డాయని, విద్యార్థులు ఎంత వెనుకబడి ఉన్నా మెరుగైన శిక్షణ ఇస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలగుతారన్నారు. వందకు వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించినా విద్యార్థులు ఫెయిలైతే అది మన బోధన లోపమేనని అన్నారు. గత ఫలితాలను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధించడానికి ప్రయత్నించాలన్నారు. గురువులకు తన శిష్యుడు ఉన్నత స్థానానికి వెళితే ఎంత గౌరవంగా భావిస్తారో, అదే ఫెయిలైతే అంతే అవమానంగా భావించాలన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. విద్యార్థులు అత్యధిక శాతం మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లోనే వెనుకబడి ఉన్నారని, ఆలాంటి వారిపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే ఫలితం ఉంటుందని సూచించారు. ఉత్తమ ఫలితాల కోసం ఎక్కువగా స్లిప్ టెస్టులు, మాక్ టెస్టులు నిర్వహించి వాటిపై రివిజన్ చేస్తే విద్యార్థులకు ఫైనల్ పరీక్షల భయం పోతుందన్నారు. రివిజన్ చేస్తే విద్యార్థులు మరిచిపోరని, ప్రాక్టీస్ ఎక్కువగా చేయించేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల వెనుకబాటుపై చర్చించి వారికి సూచనలు చేయాలన్నారు. డీఈవో సుశిందర్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు 'సీ' గ్రేడ్ విద్యార్థులను గుర్తించి ఐదుగురి చొప్పున బృందాలు ఏర్పాటు చేసి మెరుగైన సూచనలు చేయడం వల్ల పరీక్షలకు ప్రిపేర్ చేయించాలన్నారు. పరీక్షలు జరిగే వరకు పాఠశాలలో ఎలాంటి కల్చరల్ యాక్టివిటీస్ వంటివి నిర్వహించకూడదన్నారు. ఉపాధ్యాయులు, ప్రధాన ఉపాధ్యాయులు సమష్టిగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు పాల్గొన్నారు.

సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి

విఠాయిపల్లిలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో అరుణకుమారి

ఆమనగల్లు, ఫిబ్రవరి 7 : పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని విఠాయిపల్లి గ్రామంలో మొక్కజొన్న, వరి, వేరుశనగ పంటలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట విస్తరణ అధికారి మీనాక్షి, రైతులు నారమోని పార్వతమ్మ, జంగమ్మ, లక్ష్మి, యాదమ్మ తదితరులు ఉన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించండి'

ఏడీఏ శ్రీనివాస్‌కు, ఏఈ సీతారం లకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 7 : 2011 సంవత్సరం నుంచి మీటర్ రీడర్స్‌గా పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఆమనగల్లు సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఏడీఏ శ్రీనివాస్, ఏఈ సీతారం లకు మీటర్ రీడర్స్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. 2011 నుంచి మీటర్ రీడర్స్‌గా పని చేస్తున్నామని, కనీస వేతనాలు అందజేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో భరత్, నరేశ్, వంశీ, కుమార్ ఉన్నారు.

'గృహజ్యోతి'కి వివరాలు అందజేయాలి

–చేవెళ్ల డివిజన్ విద్యుత్‌శాఖ ఏడీ స్వామి



షాబాద్‌లో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న విద్యుత్తు శాఖ ఏడీ స్వామి, ఏఈ నరేందర్

షాబాద్, ఫిబ్రవరి 7: గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకానికి సంబంధించిన వివరాలు అందజేయాలని చేవెళ్ల డివిజన్ విద్యుత్ శాఖ ఏడీ స్వామి, షాబాద్ మండల విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి విద్యుత్తు వినియోగదారుల నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్ సిబ్బందికి అందజేయాలని విద్యుత్తు వినియోగదారులకు సూచించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు వివరాల సేకరణ పూర్తి చేయనున్నామన్నారు. వారి వెంట లైన్‌మెన్‌లు నర్సింహులు, పరశురామ్, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

షాబాద్, ఫిబ్రవరి 7: ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుని డిశ్చార్జ్ అయిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను బుధవారం రాత్రి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నగరంలోని పంజాగుట్టలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు వెళ్లి పరామర్శించారు. స్పీకర్ వెంట ఎమ్మెల్యే తనయుడు శ్రీకాంత్ తదితరులున్నారు.

సమతామూర్తి చిట్‌ఫండ్ డైరెక్టర్ల అరెస్టు

120 మంది బాధితులు... దాదాపు రూ.5 కోట్ల మోసం

వివరాలు వెల్లడించిన మాదాపూర్ డీసీపీ వినీత్

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 7: చిట్టీల పేరుతో అమాయక ప్రజలను నమ్మించి.. కోట్లాది రూపాయలు వసూళ్లు చేసి బోర్డు తిప్పేసిన ఓ చిట్‌ఫండ్ సంస్థకు చెందిన ఇద్దరు డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం గచ్చిబౌలి కార్యాలయంలో మాదాపూర్ డీసీపీ వినీత్ వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఎల్పుల శ్రీనివాస్(47), అతడి కుమారుడు రాకేష్(27), ఎల్బీనగర్‌కు చెందిన గణేశ్ కలిసి 6 నెలల కిందట మాదాపూర్‌లో సమతామూర్తి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరులో చిట్‌ఫండ్ వ్యాపారం ప్రారంభించారు. మాదాపూర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లిలో ఈ సంస్థ కార్యాలయాలను కూడా ప్రారంభించారు. రూ.5 లక్షలు నుంచి కోటి రూపాయల వరకు చిట్టీలు నిర్వహించి.. అమాయక ప్రజలను నమ్మించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. ఇటీవల సంస్థ నిర్వాహకులు చిట్టీ డబ్బులు చెల్లించడంలో జాప్యం చేశారు. బాధితులకు సంస్థ ఇచ్చిన చెక్కులు కూడా బ్యాంకుల్లో చెల్లడంలేదు. ఇదంతా మోసమని గ్రహించిన బాధితులు జనవరి 13న మాదాపూర్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. చిట్‌ఫండ్ డైరెక్టర్లు ఎల్పుల శ్రీనివాస్, రాకేష్‌ను మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. దాదాపు 120 మంది బాధితుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశామని, సుమారు రూ. 5 కోట్ల వరకు చిట్‌ఫండ్ నిర్వాహకులు మోసాలకు పాల్పడినట్లు డీసీపీ తెలిపారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.

ఎలాంటి అనుమతి లేదు..

ఈ చిట్‌ఫండ్ సంస్థకు ఎలాంటి అనుమతులు లేవని డీసీపీ తెలిపారు. సమతామూర్తి పేరును వాడుకోవడం జరిగిందన్నారు. చినజీయర్ స్వామికి, ఈ సంస్థకు ఎలాంటి సంబంధాలు లేవని మీడియా అడిగిన ప్రశ్నకు డీసీపీ బదులిచ్చారు. ఈ సమావేశంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిలోఫర్‌లో అగ్నిప్రమాదం

అందరూ క్షేమం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ)/తెలుగు యూనివర్సిటీ: నిలోఫర్ హాస్పిటల్‌లోని బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో బుధవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంతో రోగులు, వారి బంధువులు ఆందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తు ప్రమాదం సంభవించిన బ్లాక్‌లో రోగులకు సంబంధించి ఎలాంటి వార్డులు లేకపోవడంతో పాటు ల్యాబ్ సిబ్బంది అప్పటికే వెళ్లిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. వివరాల్లోకి వెళితే.. నిలోఫర్ దవాఖాన పాత భవనంలోని మొదటి అంతస్తులో ఉన్న బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో సాయంత్రం 5 గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవించి పొగలు వచ్చాయి. ల్యాబ్‌లో ఔషధాలు నిల్వచేసే రిఫ్రిజిరేటర్‌లో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి మంటలు అంటుకున్నట్లు దవాఖాన ఆర్ఎంఓ డా.జ్యోతి తెలిపారు. ఈ మంటలు ల్యాబ్‌లో వ్యాపించడంతో అందులో ఉన్న కంప్యూటర్లు, ల్యాబ్‌కు సంబంధించిన ఇతర వస్తువులు కాలిపోయి, పొగలు అలుముకున్నట్లు తెలిపారు. అయితే, ఘటన జరిగిన బ్లాక్‌లో ఎలాంటి వార్డులు లేకపోవడంతో అక్కడ రోగులెవరూ లేరని, అంతేకాకుండా సాయంత్రం కావడం వల్ల ల్యాబ్‌లో పనిచేసే సిబ్బంది కూడా ఇండ్లకు వెళ్లిపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని వివరించారు. ప్రమాదాన్ని గమనించి వెంటనే అగ్నిమాపక శాఖకు, పోలీసులకు సమాచారమిచ్చామన్నారు. దీంతో ఫైర్ ఇంజన్ ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పివేసిందని, ముందు జాగ్రత్త చర్యగా ప్రమాదం జరిగిన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రోగులను ఐసీయూ భవనానికి తరలించామన్నారు. సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యేతో పాటు వైద్యాధికారులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్

సభ్యుల నియామకం చెల్లదు

హైకోర్టు తీర్పు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) ః హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులుగా బడ్డిపడగ రాజిరెడ్డి, కె. కాత్యాయినిల నియామకాలు సుప్రీంకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఉన్నాయని హైకోర్టు తప్పుపట్టింది. ఆ నియామకాలు చెల్లవని ఇటీవల తీర్పు చెప్పింది. రాజిరెడ్డి, కాత్యాయినిలను జిల్లా వినియోగదారుల సభ్యులుగా నియమిస్తూ 2023 ఆగస్టు 16న ప్రభుత్వ ఉత్తర్వులు 28ని సవాల్ చేస్తూ కె. సరిత దాఖలు చేసిన పిటిషన్ పై జస్టిస్ పి.మాధవీదేవి విచారణ చేశారు. పిటిషనర్ ఎక్కువ మార్కులు పొందారని, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ ధ్రువీకరణ పూర్తి చేసినా, వాళ్ల కంటే తక్కువ మార్కులు వచ్చిన ఆ ఇద్దరినీ నియమించడం చెల్లదని పిటిషనర్ న్యాయవాది వాదించారు. 2023 మార్చి 3న కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ వర్సెస్ మహీంద్ర భాస్కర్ లిమయే కేసులో సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా నియామకాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ న్యాయవాది ప్రతివాదన చేస్తూ, నియామక నోటిఫికేషన్ ప్రక్రియ అంతా సుప్రీంకోర్టు తీర్పునకు ముందే జరిగిందన్నారు. తీర్పు తర్వాత ఉత్తర్వులు వెలువడ్డాయని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, ఇద్దరి నియామకాలను రద్దు చేసింది. అయితే, ప్రభుత్వం చట్టపరమైన ప్రత్యామ్నాయాలను ఆశ్రయించేందుకు, తీర్పు అమలును 4 వారాలపాటు నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది.

రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వల పరిశీలన



మండల కేంద్రంలోని మిల్లులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీటీ రఘునందన్

కడ్తాల్, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని పలు రైస్ మిల్లులను బుధవారం జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రైస్ మిల్లులోని ధాన్యం నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం సీఎంఆర్ కింద ఇచ్చిన వడ్లను మిల్లింగ్ చేసి, బియ్యం సేకరణ త్వరగా పూర్తి చేయాలని మిల్లర్లకు ఆయన సూచించారు. లెవీ బియ్యాన్ని త్వరితగతిన పూర్తి చేయలేని మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడమే కాకుండా, లెవీ అనుమతులను రద్దు చేసేందుకు సిఫారస్ చేస్తానని హెచ్చరించారు.

మా ఊరి చెరువులు కాపాడండి !

ఎమ్మెల్యే, కలెక్టర్‌కు రైతు సంక్షేమ సంఘం విజ్ఞప్తి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలంలోని గిరికొత్తపల్లి గ్రామంలో చెరువులను కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతు సంక్షేమ సంఘం గిరికొత్తపల్లి గ్రామ అధ్యక్షుడు శ్రీను ఆరోపించారు. చెరువులను సంరక్షించుకోవాల్సింది పోయి కబ్జాలు చేసి గ్రామానికి అన్యాయం చేస్తున్నారని చెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ గ్రామంలో 6 చెరువులు ఉన్నాయని, ఇందులో ఒక చెరువును పూర్తిగా కబ్జా చేసి వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. మరొక చెరువును కబ్జాకు యత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్నీ తమ నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి రెండుసార్లు తీసుకెళ్లినా స్పందన లేదని వాపోయాడు. పది మంది రైతులం చెరువులను కాపాడండి అంటూ ఇటు ఎమ్మెల్యే.. అటు కలెక్టర్ వద్దకు తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదని చెప్పారు. చెక్ డ్యాంలను బ్రేక్ చేసి కాలువులను పూడ్చి చెరువులను లేకుండా చేయడానికి అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేతులు కలిపారని ఆరోపించారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు

షాబాద్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు అన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్)వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్, మునీర్‌పాషాతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించడానికి కృషి చేయాలన్నారు. టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ 2023 సంవత్సరం ఎస్ఎస్‌సీ స్పాట్ వెలివేషన్ టీఏడీఏలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి మొగులయ్య, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.నారాయణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి శంకరయ్య, జిల్లా కార్యదర్శి సి.హెచ్ మొగులయ్య, శంకర్‌పల్లి మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి, చేవెళ్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానందం, శివానందం, జీహెచ్ఏంలు లక్ష్మి, జీవనజ్యోతి పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో సుశిందర్‌రావు, తదితరులు

ఆశాజనకంగా జొన్నసాగు

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారిస్తున్న రైతులు

నియోజకవర్గంలో 68 హెక్టార్లలో జొన్న పంట సాగు

చేవెళ్ల టౌన్ ఫిబ్రవరి 6 : ఈ యాసంగిలో జొన్న పంట సాగుకు రైతులు మొగ్గు చూపారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో సంప్రదాయ పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అన్నదాతలు దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా వానకాలంలో సాగయ్యే జొన్న పంటలు ఇప్పుడు యాసంగిలోనూ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వానకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసిన కారణంగా అధికంగా వరి చేశారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున జొన్న పంటను సాగు చేశారు. వరి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. ఈసారి నియోజకవర్గంలో జొన్న పంట అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉన్నది. ప్రజల ఆహారపు అలవాట్లలో ఎంతో మార్పు వచ్చింది. అధిక శాతం మంది అన్నం తీసుకోవడాన్ని తగ్గించి రొట్టెలు తినేందుకుఎక్కువగా ఇష్టపడుతున్నారు. దీంతో జొన్నలకు విపరీతమైన డిమాండ్ లభిస్తున్నది.జొన్నలకు పెరుగుతున్న డిమాండ్‌తో రైతులు జొన్న సాగు చేసేందుకు ఆసక్తిని చూపుతున్నారు. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల్లో జొన్న సాగు పెరిగింది. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో 68 హెక్టార్లలో జొన్న పంట సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. ఈసారి పంట బాగా పెరిగి ఆశాజనకంగా ఉన్నది. జొన్న పంట వారం పది రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉన్నదని రైతులు పేర్కొంటున్నారు.

పిట్టల బెడద..

జొన్నపంట చేతికి వచ్చిన సమయంలో పిట్టలు, అడవి పందుల బెడద ఎక్కువగా ఉన్నది. పగలంతా పిట్టల కోసం, రాత్రి అడవి పందుల నుంచి పంట కాపాడుకునేందుకు పడిగాపుల కాయాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జొన్నసాగుకు ఖర్చు తక్కువ..

రబీ సీజన్ జొన్నపంట సాగుకు అనుకూలంగా ఉంటుంది.బోర్లలో నీరు తగ్గే అవకాశాలను ముందే గుర్తించి జొన్న సాగుచేశా. పంట కూడా బాగానే ఉన్నది. రెండు వారాలు అయితే పంట చేతికి వస్తుంది. జొన్న సాగుకు పెట్టుబడి ఖర్చులు కూడా తక్కువే. అయితే పిట్టల బాధ మాత్రం ఉన్నది.

– లక్ష్మయ్య

68హెక్టార్లలో జొన్న పంట..

చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలలో 68 హెక్టార్లలో జొన్న పంటను సాగు చేశారు. జొన్నలకు పెరుగుతున్న డిమాండ్‌తో రైతులు ఆసక్తిని చూపుతున్నారు. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల్లో జొన్న సాగు బాగా పెరిగింది. యాసంగిలో బోరుబావుల్లో నీరు తక్కువగా ఉంటుంది కాబట్టి రైతులు జొన్న సాగు మ